# ముక్కుపుల్ల

శ్రీ పి. వి. ఎస్. రామదాసు

“ఇంత పని చేశాక నిన్నింకా పనిలో ఉంచుకోమంటావా? ఇంకెప్పుడూ దొంగపని చేయకుండా బుద్ధిరావడానికి నిన్ను పోలీసులకు అప్పగించినా తప్పులేదు’ అన్నాడు వెంకటరావు.

పాతికేళ్ల పనిమనిషి పోచమ్మ ఏడుస్తూ నిలుచుంది.

పోచమ్మను విడిగా చూస్తే పనిమనిషి అని ఎవరూ అనుకోరు. నూనె రాసి చక్కగా దువ్వి, తీరుగా పెట్టిన ముడి, ముడిలో తురిమిన కనకాంబరాలూ, క్రొత్త ఖరీదైన నయాపైసల నాణెమంత కుంకుమబొట్టూ, శుభ్రంగా ఉతికి పొందికగా కట్టిన చీరా, బిగుతుగా నిండుగా అమరిన రవికా చూసినవారు ఆమెను పనిమనిషిగా పెట్టుకోడానికే జంకుతారు.

ఆదివారం కదా అని ఇంగ్లీషు సినిమా ప్రోగ్రాం పెట్టుకుని వెంకటరావుని తీసుకుని వెళదామని ఇబ్రహీం మంజిల్ కాలనీ నుంచి మలకపేట కాలనీకి అరగంట క్రితం వచ్చిన కరుణాకరరావు ఆ గొడవమూసి లోపలికి వెళ్లడానికి సంకోచిస్తూ దూరంగా నిలుచున్నాడు.

ఆ ఇంటినిండా పదిమంది ఆమ్మలక్కలు చేరారు.

‘పనిమనిషికి దొంగబుద్ధి ఉంటే కష్టం సుమండీ’ అన్నది ఒకామె తక్కినవారికి దొంగబుద్ధి ఉంటే ఫరవాలేదనే ధ్వని రాకుండా.

‘అసలు దాన్నిచూస్తే—దాని పోకడా, దాని వేషమూ చూస్తే అది పనిమనిషి అని ఎవరూ అనుకోరు.’ అన్నది మరొకామె.

‘రోజుకొక రకం జుట్టుముడీ, రకరకాల గిల్టు ముక్కుపుడకల మార్పు, లోలక్కులూ, రింగులూ - ఒకటేమిటి అది వేసే వేషాలకి ఏ సినిమా స్టారూ సరిపోదు’ అన్నది వేరొకామె.

‘ఆ వయ్యారమూ, ఆ కులుకూ, ఆనడకా, ఆ తనివి శ్రీమంతులకు కూడా రావు’ అన్నది మరొకామె.

‘సిగ్గు విడిచిపెడితే చాలు, అవే వస్తాయి.’ అన్నది ఒకామె.

‘తనేదో, తన తాహతేదో గ్రహించక కొడుకును చదివిస్తుందా?’ అని ముక్కుమీద వ్రేలు వేసుకుంది మరొకామె.

‘చదివించినా ఏదో గవర్నమెంటు స్కూలులో వెయ్యక మన మాదిరిగా కాన్వెంటులో వేసి చదివిస్తుందా’ అని ఆశ్చర్యపోయింది వేరొక గేస్తురాలు.

‘శక్తికి మించిన పరుగులు పరుగెత్తడ మెందుకు? ఇలా దొంగతనాలు చెయ్యడమెందుకు?’ అన్నది ఒక గృహిణి.

‘ఇటువంటి పని చేసిన దానిని పోలీసులకు అప్పజెప్పాలి.’ అన్నది వెంకటరావు భార్య.

‘అంతపని సెయ్యకమ్మా, నీకాలు మొక్కుతా.’ అన్నది పనిమనిషి పోచమ్మ.

‘మరి నువ్వు చేసినది దొంగపని అవునంటావా కాదంటావా?’ అన్నది వెంకటరావు భార్య.

‘జర గలత్ అయిందమ్మా దిమాక్ ఖరాబయింది. పోరడికి యిస్కూలుకి పైసలు సాల్లేదు...’ అని వివరించబోయింది పనిమనిషి పోచమ్మ.

‘అయితే నా వస్తువు దొంగతనం చేసి తాకట్టు పెడతావా?’ అన్నది వెంకటరావు భార్య.

‘మాఫ్ చెయ్యమంటున్నా. నాది దొంగబుద్ధికాదు. పోయిన నెల పోరడికి ’యిస్కూలు పైసలు తక్కువయినాయి. అందరినీ అడిగినా ఒక్కరూ యివ్వకపోయిరను ఏం సెయ్యాలమల్లా? గుండె బేజారయింది. నిన్నూ అడిగినా యాదుందా?’

‘అవును. అడిగావనుకో. లేదన్నమాత్రంచేత దొంగపని చేస్తావా?’

‘ఆ మాటనకమ్మా, నీ కాలు మొక్కుతా. నాది దొంగబుద్ధి కాదమ్మా. నేను చోర్ అయితే నీ ముక్కుపుల్ల మళ్లీ నీకు తెచ్చియిస్తునా?’ అన్నది పనిమనిషి పోచమ్మ.

‘అసలు మొట్టమొదట ఆ పని ఎందుకు చేశావు?’ అన్నది వెంకటరావు భార్య.

‘ఎవరినడిగినా పైసలియ్యక పోయిరి. నాకున్న అసలు బంగారం ముక్కుపుల్ల ఎన్నడో అమ్మేస్తిని.’

‘నీ మగడు వడ్రంగి పని చేస్తాడు కదా, ఆ మాత్రం డబ్బు అడగలేకపోయావా?’ అన్నాడు వెంకటరావు.

‘ఆడు తెచ్చిందంతా ఆడి నిషాకి, కుడికే సరిపోతది. నాకేమిస్తడు. మట్టి?’ అన్నది పనిమనిషి పోచమ్మ.

'అలాగని దొంగతనం చేస్తావా?' అన్నాడు వెంకటరావు.

'అయ్యా, చోరీ కాదయ్యా పోయిన నెల అమ్మ తలంటు కుండది. దుద్దులూ, ముక్కుపుల్లా భరిణెలో పెట్టి దాసింది నేను దొంగనయితే అన్నీ తీసేదాన్ని కదా దొంగను కాను కనుకనే ముక్కుపుల్ల ఒక్కటే తీసి తాకట్టు పెట్టా. పబ్బం గడిపింది.'

'మరి అప్పుడు మేము ముక్కుపుడక పోయిందో అని గోల పెట్టినప్పుడు నువ్వు ఏమీ అనకుండా ముసుగు తన్ని పాములా ఊరుకున్నావేం?' అన్నది వెంకటరావు భార్య

'అదే నేను చేసిన గల్తీ ఈ నెల ఎహోలకి తనఖా పైసలు వడిసెంక ముక్కుపుల్ల విడిపించి తెచ్చి యిస్తాని ఇంకా దొంగ అనక మాఫ్ చెయ్యి అమ్మ, మీ కాలు మొక్కుతా పోలీసు మాట అనకయ్యా. ఎప్పటిలా మీ బాసన్లు తోముతా, పనిలో ఉంచుకో అయ్యా.' అన్నది పని మనిషి పోచమ్మ

'ఇంత పని చేశాక నిన్నింకా పనిలో ఉంచుకోమంటావా? ఇలాంటి దొంగపని చెయ్యకుండా నీకు బుద్ధి రావడానికి నిన్ను పోలీసులకు అప్పజెప్పినా తప్పు లేదు' అన్నాడు వెంకటరావు.

పని మనిషి పోచమ్మకి దుఃఖం ఆగలేదు ఏడుస్తూ నిలుచుంది.

అరగంట క్రితంనుంచీ బయట నిలుచుని గమనిస్తూ ఉన్న కరుణాకరరావు సినిమా ప్రోగ్రాంకి తిలోదకాలిచ్చుకుని తిరుగుముఖం పట్టాడు

కాళ్ళీడ్చుకుంటూ బస్సు స్టాపు వైపుకి నడిచాడు కరుణాకరరావు అతడు అల్లంత దూరంలో ఉండగా ఒక బస్సు దూసుకు పోయింది. నిరుత్సాహంగా బస్సు స్టాపు దగ్గరకు చేరి నిలబడ్డాడు కరుణాకరరావు.

మరొక గంట వరకూ తనకు బస్సు లేదన్న విషయం అనుభవపూర్వకంగా తెలిసినదే కాబట్టి అంతవరకు నిలబడే ఓపిక లేక చుట్టూ కలయచూశాడు కరుణాకరరావు. దగ్గరలో ఒక రాతి బండ కనిపించగా దాని మీద కూర్చున్నాడు.

వెంకటరావు యింటి దగ్గర జరిగిన గొడవ గురించి ఆలోచించాడు కరుణాకరరావు

నిజమే, పనిమనుషులతో చాలా పేచీ లున్నాయి. నిజానికి తన యింట్లో కూడా ప్రస్తుతానికి పనిమనిషి లేదు వాళ్ళు పెట్టే వాగాలకీ వాళ్ళు చేసే చిన్న చిన్న చౌర్యాలకీ విసిగి పనిమనుషులతో వేగలేక మానిపించింది అతని భార్య సుగుణ.

కాని, వెంకటరావు యింటిలో పనిచేసిన పోచమ్మ ఒక విశిష్టమైన వ్యక్తిగా అతనికి తోచింది.

పోచమ్మ శుభ్రతా, నాజూకుతనమూ ఒక ఎత్తూ, తన కొడుకును కాన్వెంటులో చదివించి పైకి తీసుకురావాలనే ఉన్న ఆశయం మరొక ఎత్తూ! ఈ రెండు లక్షణాలూ అతనికి నచ్చాయి.

ఆమె ఆశయానికి త్రాగుబోతు భర్త చేసే సహాయం ఏమీ లేకపోయినా ఒంటరిగా పోచమ్మ జరిపే పోరాటం అతడు మెచ్చుకున్నాడు.

అలా అని ఆమె చేసిన దొంగతనాన్ని సమర్థించగలడా? ఎవరూ సహకరించని పరిస్థితులలో ఆమె అలా చేయవలసి వచ్చిందని సరిపెట్టుకున్నాడు కరుణాకరరావు అదీకాక దొంగతనం చేసిన పనిమనుషుల్ని తాను చూశాడు కాని ఇలా తనంత తానే తిరిగి వస్తువును వాపసు యిచ్చిన పనిమనిషిని చూడడం యిదే ప్రథమం.

మంచిగా బ్రతకడానికి ఆమెకు చేయూత నివ్వవలసిన కర్తవ్యం వెంకటరావుమీద ఉన్నదని కరుణాకరరావు అనుకున్నాడు. ఒకసారి తప్పుచేసినంతమాత్రాన పోలీసులకి అప్పచెబితే జైలు గదిగోడలు చూసిన వ్యక్తిని బాగుచెయ్యడం మరింత కష్టం అవుతుందని అతని నమ్మకం.

ఈ విధంగా కరుణాకరరావు ఆలోచిస్తూ, బస్సుస్టాపు దగ్గరకు వచ్చి చేరిన జనాన్ని పరధ్యానంగా చూస్తూండగా పనిమనిషి పోచమ్మ విషణ్ణవదనంతో అతనికి కనిపించింది

కరుణాకరరావు చేతిగడియారం చూశాడు. తానక్కడ కూర్చుని నలభై నిముషాలయిందని గ్రహించాడు.

జనానికి దూరంగా మ్లానవదనంతో నిలుచున్న పనిమనిషిని పోచమ్మను చూసి కరుణాకరరావు లేచాడు.

ఏమి జరిగిందో తెలుసుకోవాలనే కౌతుకంతో ఆమె నిలుచున్న చోటికి వెళ్ళాడు.

'అవ్వా, ఏమయింది'? అన్నాడు కరుణాకరరావు.

'కొంప మునిగిందయ్యా ఈ కాలనీలో అందరూ! నన్ను పని మానిపించిన్రు' అని ఏడ్చింది పనిమనిషి పోచమ్మ

'ఎందుచేత?' అన్నాడు కరుణాకరరావు.

'నేను దొంగనట. ఎట్ల బతకాల? ఏమీ పనుల్ పట్టుడు లేదు' అన్నది పనిమనిషి పోచమ్మ; ఏడుస్తూనే.

కరుణాకరరావు కాస్సేపు ఆలోచించాడు.

'ఏడవకు అవ్వా. నువ్వు మళ్ళీ అలాంటిపని చేయనని మాట యిస్తే మా యింట్లో పనిమనిషిగా పెట్టుకుంటాను. ఇకరం నుంచి వస్తావా?' అన్నాడు కరుణాకరరావు

పనిమనిషి పోచమ్మ ముఖం వికసించింది. దుమ్ము తుడిచిన అద్దంలా ఆమె ముఖం ప్రకాశించింది.

'జరూర్ వస్త.' అన్నది.

'అయితే ఇప్పుడే నాతో రా. నువ్వు సవ్యంగా పనిచేసుకుంటే మా కాలనీలో ఇంకా కొంతమంది ఇంట్లో పని దొరకవచ్చు' అన్నాడు కరుణాకరరావు.

ఇంతలో బస్సు వచ్చింది. ఆమె బస్సు ఎక్కడం చూసిన తరువాత కరుణాకరరావు బస్సు ఎక్కాడు.

కోటీ వచ్చింది. అందరూ బస్సు దిగారు. పనిమనిషి పోచమ్మ దిగింది, కరుణాకరరావుకూడా దిగాడు. అతనికి కాఫీ త్రాగాలనిపించింది. కాని పనిమనిషిని కాఫీకి తీసుకుని వెళ్లడం బాగుంటుందా అనే సందిగ్ధావస్థలో పడ్డాడు. అతని మానవత్వం ఓడిపోయింది. కాఫీ త్రాగడాన్ని వాయిదా వేశాడు.

కోటీ నుండి ఆమెను ఇ(రం మంజిల్‌కి తీసుకుని వెళ్లాడు కరుణాకరరావు.

ఇంటికి వెళ్లగానే అతని భార్య సుగుణ. 'ఏమండీ, అప్పుడే వచ్చారు సినిమాకి వెళ్లలేదా? వెంకటరావుగారు లేరా? వీరెవరూ?' అని ప్రశ్నల వర్షం కురిపించింది.

'వెంకటరావుగారికి తీరుబడిలేకపోయింది. అందుకని వచ్చేశాను' అన్నాడు కరుణాకరరావు అల్పోక్తిగా.

'పోనీలెండి. వీరెవరూ?' అన్నది సుగుణ.

'మనకి పనిమనిషి కావాలికదా. అందుచేత ఒక స్నేహితుని సిఫార్సుమీద ఈమెను తీసుకు వచ్చాను.' అన్నాడు కరుణాకరరావు నిజానికి అబద్ధాన్ని జోడిస్తూ.

'మంచిపని చేశారు' అని ఒకసారి మళ్లీ పోచమ్మను పరీక్షగా చూసింది

'బాసెన్లు ఉన్నయా, అమ్మా' అని పనిమనిషి పోచమ్మ నోరు విప్పగానే సుగుణకు ధైర్యం వచ్చింది

వెంటనే పురమాయింపులు ప్రారంభించింది సుగుణ.

పనికి సంబంధించినంతవరకు పోచమ్మ పని సుగుణకు నచ్చింది.

కాని పోచమ్మ కొడుకుని తన కొడుకులతో పాటు కాన్వెంటులో చదివించడమూ, ఆమె తనకంటె శుభ్రంగాను అందము గానూ ఉండడం సుగుణకు నచ్చలేదు. అయినా ఆమెను మాని పించితే సొంతంగా అంట్లు తోముకోవాల్సి వస్తుందని సహనం చూపేది సుగుణ.

పనిమనిషి పోచమ్మ శక్తివంచన లేకుండా తనపని శుభ్రంగా చేయడం చూసిన మరికొంతమంది యిళ్లలో ఆమెకు పని దొరికింది.

వారి పిల్లలకుకూడా పోచమ్మ అంటే ఎంతో యిష్టం.

ఈ విధంగా కొన్ని నెలలు గడిచాయి. తా నొకరికి సహాయం చేయగలిగాను కదా అని కరుణాకరరావు అప్పుడప్పుడు సంతోషించేవాడు.

అదే సంతోషంతో—పనిమనిషి పోచమ్మ కనబడినప్పుడు ఆమెవైపు జాలితో దయతో చూసేవాడు --

ఆ విధముగా కరుణాకరరావు పనిమనిషి పోచమ్మను చూడడం సుగుణ గమనించింది. కాని సరిగా అర్థం చేసుకోలేక పోయింది. జాలి దృష్టికీ మోహదృష్టికి తేడా తెలుసుకోలేక పోయింది సుగుణ.

ఇట్లా రోజులు గడుస్తున్నాయి.

దసరా వచ్చింది

బొమ్మలకొలువు పెట్టడాలూ, ఒక కాలనీవారు మరొక కాలనీకి పేరంటానికి వెళ్లడాలూ జరిగాయి.

అదనంగా ఎంతపని తగిలినా విసుగుకోకుండా పనిచేసింది పని మనిషి పోచమ్మ.

సుగుణకూడా పోచమ్మను ఎక్కువగా ఆదరణతో చూడడం వల్ల కరుణాకర రావుకి మరింత సంతోషం కలిగింది.

దీపావళి వచ్చేనాటికి తానేదో గొప్ప పని చేసినట్లు భావించాడు కరుణాకరరావు. అంధకారంలో పడడానికి సిద్ధముగా ఉన్న ఒకనాటి ప్రాణికి వెలుగుచూపించిన తృప్తి ఆతనికి కలిగింది.

ఆరోజు నరక చతుర్దశి.

తెల్లవారుజామునే పోచమ్మ వచ్చింది. పిల్లలకు తలంటి నీళ్లు పోసింది సుగుణ.

కరుణాకరరావు కూడా తలంటి పోసుకున్నాడు. పిల్లల్ని వీధివాకిలిలోకి తీసుకొనివెళ్లి మతాబాలు కాలిపిస్తున్నాడు.

సుగుణ అభ్యంగ స్నానంచేసి బట్టలు కట్టుకుని హాలులోకి వచ్చి, 'పోచమ్మా, ఆ దుద్దుల భరిణె తీసుకురా' అన్నది.

పోచమ్మ గదిలోకి వెళ్లి అలమరాలో నున్న భరిణె తీసుకువెళ్లి యిచ్చింది.

'పోచమ్మా. ముక్కుపుడక కనపడటం లేదేమిటో' అన్న సుగుణమాటలు విని కరుణాకరరావు లోపలికి వచ్చాడు.

'నాకు తెల్దమ్మా' అన్నది పనిమనిషి పోచమ్మ.

'నీకు తెలియకపోతే యింకెవరికి తెలుస్తుంది మర్యాదగా యిచ్చేసెయ్యి, నీ దొంగబుద్ధి ఎక్కడికిపోతుందో? అన్నది సుగుణ.

'సత్తెపెమానికంగా నాకు తెల్దు. నా బిడ్డ కొడుకుతోడు.' అన్నది పోచమ్మ.

'అనవసరంగా పసివానిమీద ఒట్లు పెట్టకు. మర్యాదగా ఇచ్చేసెయ్యి' అన్నది సుగుణ

కరుణాకరరావు తనచెవులను తానే నమ్మలేకపోయాడు. తానేదో బాగుచేశాననుకున్న వ్యక్తి యింతపని చేస్తుందా? ఇప్పుడేం చెయ్యాలి?

"ఉండు సుగుణా నేనడుగుతాను. అసలామె తీసి ఉండక పోవచ్చు" అన్నాడు

'పోనీ మీరైనా అడిగి నాముక్కుపుల్ల దానిచేత యిప్పించండి మీ మాటకైనా విలువ యిస్తుందేమో చూద్దాం' అన్నది సుగుణ రెండవసారి కాఫీ పెట్టడానికి వంటింట్లోకి పోతూ.

'అయ్యో నాకే పాపమూ తెల్దు' అన్నది పనిమనిషి పోచమ్మ.

'చూడు, పోచమ్మా, నీకేమయినా డబ్బు కావాలంటే నన్న డిగి తీసుకోలేక పోయావా? ఎందు కిలాంటి పనిచేశావు?' అన్నాడు కరుణాకరరావు.

'నేను తియ్యలేదయ్య' అని గద్గదిక కంఠంతో చెప్పింది పోచమ్మ.

'నీ మాటలు ఎలా నమ్మాలో తెలియడంలేదు. నీకు సాయంత్రంవరకు వ్యవధి యిస్తున్నాను ఈలోగా నిజం చెప్పేసెయ్. నీకేమన్నా డబ్బు కావాలంటే నేనిస్తాను.' అన్నాడు కరుణాకరరావు.

'నాకు ఏమీతెల్దు, అయ్య.' అని పనిమనిషి పోచమ్మ వేరే ఇండ్లలో పనిచేయడానికి పోయింది.

ముక్కుపుడక ఎక్కడైనా దొరుకుతుందేమోనని పిల్లలతో కరుణాకరరావు ఇల్లంతా నలుమూలలా వెతికాడు. కాని లాభం లేకపోయింది.

'మీకేమయినా పిచ్చిపట్టిందా? ఎత్తుకుపోయిన సొత్తు ఇంట్లో దొరుకుతుందా?' అన్నది సుగుణ.

'అయితే పనిమనిషి తీసిందంటావా?'

'తప్పకుండాను. దీనికిలాంటి దొంగపని క్రొత్తేంకాదు. ఇది వరకు మలకపేటలో చేసిందటగా?' అన్నది సుగుణ.

'ఎవరు చెప్పారు నీకు?'

'దసరా బొమ్మలకొలువుకి వెంకటరావుగారి భార్య పేరంటానికి వచ్చినప్పుడు చెప్పింది.' అన్నది సుగుణ అతనిని దీక్షగా చూస్తూ.

పనిమనిషి పోచమ్మ బ్రతుకుతెరువు నిలపడంకోసం తా నే విషయం దాచుదామనుకున్నాడో అది సుగుణకు తెలియడంతో కరుణాకరరావు విస్తుపోయాడు.

'మీరలా ఊరుకోవడం కాదు. దీనిమీద పోలీసు రిపోర్టు యివ్వండి' అన్నది సుగుణ.

'చూడు సుగుణా. ఆమె తీసిందో లేదో మనం ఎవరమూ చూడలేదు. ఒకసారి నేరం చేస్తే మళ్ళీ చేస్తుందనుకోవడం పొరపాటు. అమాత్రందానికి మనం పోలీసురిపోర్టు యిస్తే ఆమెకు పని దొరకడం కష్టం' అన్నాడు కరుణాకరరావు

'మీకు పనిమనిషిమీద ఉన్నంత అభిమానమైనా నామీద లేదు' అన్నది సుగుణ కసిగా.

'ఛ. ఛ. అదేమిటి సుగుణా, నీకు పనిమనిషితో పోలికేమిటి?' అన్నాడు.

'చెడురోజులు వస్తే ఒక్కొక్కప్పుడు ఎవరితోనైనా పోటీ పడవలసివస్తుంది. దానికేంగాని మీరు దానిమీద పోలీసురిపోర్టు యివ్వడానికి యిష్టపడినా యిష్టపడకపోయినా అది ఈ రోజు నుంచి నా యింట్లో పనిచెయ్యడానికి వీలులేదు' అన్నది సుగుణ ఖచ్చితంగా.

'సరే నీ యిష్టం.' అన్నాడు కరుణాకరరావు నిస్పృహ యుంగా.

ఆ సాయంత్రం పోచమ్మతో కరుణాకరరావు యిలా అన్నాడు. 'నువ్వు నాతో నిజం చెప్పడంలేదు. నువ్వు యిదివరకు చేసినపనికీ యిప్పుడు చేసినపనికి పోలీసురిపోర్టు యివ్వవలసినదే. కాని ఈ దీపావళిపండుగరోజున ఆ పని చెయ్యదలచుకోలేదు. అయితే ఒకటి మాత్రం తప్పదు. నువ్వింక మా యింటికి పనికి రానక్కరలేదు.'

'మీకు రహం లేకపాయె. ఇది నా బదనసీబ్.' కాని సత్తెం సెబుతూండా. నేను మీ ముక్కుపుల్ల తియ్యలేదు. మీ పని మానమంటున్నారు. ఏంచెయ్యాల? నాకు మానడం పసందు లేదు. అయినా మీరు మాలిక్‌లు. మీ హుకుమే మాకు ఫర్మానా. పోతుండా.' అని వెళ్ళిపోయింది పనిమనిషి పోచమ్మ.

పిల్లలంతా ఉత్సాహంగా మతాబాలు వెలిగిస్తున్నారు. కాని అతడేదో వెలితి ఉన్నట్లు చిన్నబోయిన ముఖంతోనే దీపావళి చేశాడు.

ఆ రాత్రి పిల్లలంతా పడుకున్న తరవాత. 'ఏమండీ అదోలా ఉన్నారు? దానిని పనిలోనుంచి మానిపించేశామనా? దొంగతనం చేసిన దానిని ఎలా పనిలో ఉంచుకుంటాము?' అన్నది సుగుణ.

'ఆమె దొంగతనం చేసినదో లేదో మనకు తెలియదు...'

'అది తియ్యకపోతే భరిణే తినేసిందా? ఎలా పోయింది ముక్కుపుడక?'

'ఏమో. కాని, ఆమెను ఎందుకు పనిలోనుంచి తీసివేశామో. ఎవరికీ చెప్పకు.'

'చెబితేనేం?'

'చెబితే అందరూ ఆమెను పనిలోంచి తీసేస్తారు. .'

'తీసేస్తే ఆమెకేం గడవకపోదు. ఆమె సంగతి మీకు తెలియదనుకుంటాను.' అన్నది సుగుణ

'ఎలా గడుస్తుందంటావు?'

'దాని గురించి ఒక్కొక్కరు నాకు చెప్పిన మాటలు మీ కెలా తెలుస్తాయి?'

'ఏమిటని?'

'అదెక్కడెక్కడ పనిచేస్తుందో అక్కడ మగవాళ్ళంతా ఆమె పక్షమే. అదంటే పడిచస్తారు, మీకు మల్లే.' అన్నది సుగుణ కసిగా.

'సాటి స్త్రీ గురించి అంత చులకనగా మాట్లాడతావేం, సుగుణా?' అన్నాడు కరుణాకరరావు మందలిస్తూ.

'పనిమనిషిని పట్టుకుని సాటిస్త్రీ అంటారేమండీ. అవును మరి. మీ కంటికి ఆమె ఆ విధముగానే కనిపిస్తుంది.' అన్నది సుగుణ వెటకారంగా.

'మానవత్వం మరిచిపోకు, సుగుణా.'

'పెద్ద పెద్ద మాటలు చెప్పి మీ స్వార్థానికి రంగు పూయకండి.' అన్నది సుగుణ తీవ్రంగా.

'ఏమిటే నువ్వంటున్నది? ఇందులో నా స్వార్థం ఏముంది?'

'నాకేమీ తెలియదనుకోకండి. నేను వెయ్యి కళ్లతో కనిపెడుతున్నాను. కనుక మీరేమి చెయ్యడానికీ అవకాశం దొరకనివ్వడంలేదు. పదోనంబరు పంకజంగారి మొగుడు దీనితో పరాచికాలాడుతూ ఉంటే ఆమె నాతో చెప్పుకుని ఏడ్చింది. ఇంకా చాలా ఉన్నాయి, ఆ మోహినీ పిశాచం గురించి...'

'పుక్కిటి పురాణాలు వినడానికి నాకు ఓపికలేదు. రోజుకొక ఘట్టం తీరికగా రేపటినుంచి చెబుదువుగాని ప్రస్తుతానికి నన్ను నిద్రపోనియ్యి, పదకొండు గంటలయింది...' అని గోడవైపు తిరిగాడు కరుణాకరరావు,

తాను సహాయంచేసి ఉద్ధరిద్దామనుకుంటే ఈ విధముగా పరిస్థితి విషమించినందుకు కరుణాకరరావు విచారించాడు.

చాలాసేపు ఆలోచించి చివరకు నిద్రపోయాడు.

మరునాడంతా అతనికి ఆఫీసులో ఒకటే చింత—ఎలాగైనా గృహంలో శాంతిని పునరుద్ధరించుకోవాలని.

సాయంత్రం నాలుగు గంటలకి క్యాంటీన్‌లో కాఫీ త్రాగుతూంటే అతనికొక ఆలోచన తట్టింది.

ఎప్పుడూ ఆలస్యంగా ఇల్లుచేరే తను ఆ రోజు త్వరగా ఇంటికివెళ్లి సుగుణనూ పిల్లల్నీ ఏదయినా మంచి తెలుగు సినిమాకి తీసుకొని వెళదామనుకున్నాడు గబగబా సీటు దగ్గరకుపోయి పర్మిషను చీటీ వ్రాసి శక్రటేరియట్ బయటకు వచ్చి ఆటోలో అయిదు నిముషాలలో ఇంటికి చేరుకున్నాడు.

ఉత్సాహంగా మెట్లెక్కిన అతనిని వీధి తలుపుకి వేసిన తాళం కప్ప వెక్కిరించింది.

పొరిగిండ్లలో ఏదో ఒక యింటికి పిల్లల్తోసహా సుగుణవెళ్లి ఉంటుందని అనుకుని మెట్లమీద కూర్చున్నాడు.

అయిదు నిమిషాలు గడిచాయి. ఎదురింటి పిల్లవాడు తాళాల గుత్తి యిస్తూ 'పిన్నిగారూ మా అమ్మా కలిసి రీగల్ టాకీసులో మేటనీకి వెళ్లారు.' అన్నాడు.

'మరి నువ్వు వెళ్లలేదేం?'

'అది పరమ చెత్త డబ్డ్ పిక్చరు అని నాన్నగారు చెప్పారు. అందుచేత నేను వెళ్లలేదు.'

ఆరేళ్ల కుర్రవాడు ఆ విధముగా చెప్పడం వినిన కరుణాకరరావు నవ్వుకున్నాడు.

కరుణాకరరావు తాళంతీసి లోపలికి వెళ్లాడు. కాళ్లూ చేతులూ కడుక్కుని పడక గదిలోకిపోయి వాలు కుర్చీలో కూర్చున్నాడు. ఏదయినా పుస్తకం చదువుదామనుకున్నాడు. కాని బద్ధకంగా ఉండడంవల్ల ఆ ఉద్దేశ్యం మార్చుకున్నాడు.

అతడు విసుగు లేకుండా చేయగలిగిన పనుల్లో ఫ్యామిలీ ఆల్బంలోని ఫోటోలను చూడడం ఒకటి. పెళ్లయిన తొలి రోజులలో వ్రాసిన ఉత్తరాల కట్ట చదవడం మరొకటీను.

ఆల్బమూ ఉత్తరాలకట్టా సుగుణ బట్టలపెట్టెలో ఉంటాయి. నెమ్మదిగా లేచి ఆమెపెట్టె తాళంతీసి పెట్టె తెరిచాడు. ఆల్బమూ ఉత్తరాలకట్టా మామూలుగా ఉండవలసిన స్థలంలో లేవు. బట్టలన్నీ ఇవతలవేసి వెతికాడు. పెట్టె అడుగున మరొక మూల ఆల్బమూ ఉత్తరాల కట్టా కనిపించాయి.

ఆల్బం తీశాడు. ఉత్తరాల కట్టకూడా తీశాడు. ఉత్తరాలకట్టక్రింద తెల్లని చిన్నరాయి మెరిసింది. పరీక్షగా చూశాడు.

అది ముక్కు పుడక.

ఏ ముక్కు పుడక దొంగతనం చేసిందన్న అనుమానంమీద పనిమనిషి పోచమ్మని పని మానిపించారో ఆ ముక్కు పుడక దొరికింది. అతని దృష్టిలో పోచమ్మకుగల స్థానం మరింత ఉన్నతం అయింది. ఆల్బం చూడాలనే కోరిక మానుకున్నాడు.

ముక్కుపుల్లను యథాస్థానంలో ఉంచి ఆల్బమూ ఉత్తరాల కట్టా మామూలుగా దానిపైన ఉంచి పెట్టె సర్ది తాళంవేశాడు.

కాగితం, కలం తీసుకుని ఈ విధముగా ఉత్తరం వ్రాయడం మొదలుపెట్టాడు.

'డియర్ సుగుణా,

నేను పనిమనిషి పోచమ్మ గుడిసెకు వెళుతున్నాను. నువ్వు కంగారుపడవలసిన పనిలేదు కేవలం క్షమాపణ చెప్పడానికి వెళుతున్నాను. క్షమాపణ ఎందుకు చెప్పుకోవాలో నీకీపాటికి అర్థం అయ్యే ఉంటుంది.

అయినా వ్రాస్తున్నాను ముక్కుపుల్ల నీ పెట్టెలోనే నాకు కనిపించింది.

పనిమనిషి పోచమ్మను పని మానిపించవలసిందని సూటిగా నాతో చెప్పలేకపోయావా? దానికింత పన్నాగం ఎందుకు? ఇంత అభాండం ఆమె నెత్తి మీద వెయ్యడం ఎందుకు? కాలేజీలో నాతో చదివిన అమ్మాయిలను గురించి నీతో చెప్పేటప్పుడు ఎప్పుడూ అసూయ చెందని నువ్వు ఈ ఒక్క పోచమ్మ గురించి నా మీద అనూయ పడడం ఎందుకో నాకు అర్థం కావడం లేదు.

ఆమెను మళ్లీ పనిలో పెట్టుకుందామని నేను అనను.

కాని పనిమనిషి పోచమ్మకి తక్కిన యిళ్ళలోనైనా పని విలవడానికి వీలుగా కొంతవరకైనా నిజం చెప్పాలి. పూర్తి నిజం చెప్పే ధైర్యం మనకు లేదని నాకు తెలుసు. ఏ కసువులోనో ముక్కుపుల్ల దొరికిందనీ అనవసరంగా పనిమనిషి పోచమ్మను అనుమానించామనీ నలుగురికీ చెప్పగలిగితే చాలు.

నేను క్షమాపణ చెప్పి వచ్చేలోగా ముక్కుపుడక దొరికిన సంగతి అందరికీ తెలియచెయ్యి.

ఇట్లు నీ భర్త
కరుణాకరరావు.'

ఉత్తరం వ్రాయడం పూర్తి చేసి బల్ల మీద పెట్టి ఇంటికి బీగంవేసి తాళంచేతులు గుత్తి ఎదురింటి అబ్బాయికి యిస్తూ, 'ఈ తాళం గుత్తి సుగుణత్తకియ్యి. దేవి గుడికి వెళుతున్నానని చెప్పు.' అన్నాడు కరుణాకరరావు.

'అలాగే మామా. కాని, గుడికి వెళితే మరి పువ్వులూ, పళ్లూ, కొబ్బరికాయా తీసుకెళ్లడం లేదేం?' అన్నాడా అబ్బాయి అమాయకంగా.

'నా దగ్గర లేవు బాబూ. వూరికే దేవికి నమస్కారం చేసి వచ్చేస్తా.' అని గబ గబా నడిచి వెళ్లాడు కరుణాకరరావు.